

నేటి నుంచి సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో గురువారం నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ బుధవారం తెలిపారు. 25 కిలోల ప్యాకెట్ల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని 1,867 పాఠశాలలకు 7,614 ప్యాకెట్లు, వసతిగృహాలకు 9,400 ప్యాకెట్లు, తిరుపతిలోని ఇస్కాన్ ద్వారా మధ్యాహ్న భోజనం పథకానికి 3,377 ప్యాకెట్లు, అక్షయపాత్ర ద్వారా 1,353 చొప్పున మొత్తం 21,744 ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా ప్రతి ప్యాకెట్‌పై క్యూఆర్‌కోడ్ అమలు చేసినట్లు చెప్పారు.





గతేడాది ఆగస్టు 19న శ్రీసిటీలో సిద్ధార్థ లాజిస్టిక్స్‌కు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు

మన జిల్లా

పరిశ్రమల ఖిల్లా

- జగన్ జమానాలో పరిశ్రమలు పరార్
- బాబు సారథ్యంలో వేల కోట్ల పెట్టుబడులు

ఐదేళ్ల అథోగతిలోంచి జిల్లా కోలుకుంటోంది. వైసీపీ అరాచకపాలనలో జిల్లాకు కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవే పరారయ్యాయి. ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి భరోసాగా ఉన్న అమరరాజ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలనే జగన్ జమానాలో ముప్పుతిప్పలు పెట్టారు. కొన్ని పరిశ్రమలను వాటాలకోసం వేధించారు. ఇసుక, గ్రావెల్, క్వారీల కొల్లగొట్టుడు పనుల్లో మునిగిపోయిన వైసీపీ నేతలు జిల్లా యువత భవిష్యత్తును గాలికొదిలేశారు. ఏడాది కిందట సరిగ్గా ఈరోజు.. జూన్ 12న చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్నాక జిల్లా పారిశ్రామిక చిత్రపటం రూపు మారడం మొదలైంది. కేవలం ఏడాదిలోనే రూ. 2765 కోట్ల పెట్టుబడులతో 20 పరిశ్రమలు ప్రారంభం అయ్యాయి. వాటి ద్వారా జిల్లాలో 5579 మందికి ఉద్యోగాలు లభించాయి. రూ 9 వేల కోట్ల పెట్టుబడులతో ఇంకో 19 పరిశ్రమలు జిల్లాలో మొదలు కానున్నాయి. జిల్లా యువత కళ్లలో ఆశా దీపాలు వెలిగించిన ఏడాదిగా దీనిని పేర్కొనవచ్చు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా జిల్లా పారిశ్రామిక ప్రగతి చిత్రం ఇది...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

20 పరిశ్రమలు 5,579 మందికి ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటి వరకూ జిల్లాలో రూ.2765 కోట్ల పెట్టుబడులతో 20 పరిశ్రమలు ప్రారంభం అయ్యాయి. దీనివల్ల 5579 మందికి ఉద్యోగాలు లభించాయి. నియోజకవర్గాల వారీగా చూస్తే సత్యవేడులో 14, శ్రీకాళహస్తిలో 3, గూడూరు, సూళ్ళూరుపేట, చంద్రగిరిలలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటయ్యాయి. ఏర్పేడు మండలం పరిధిలోని ఈఎంసీలో వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గూడూరు మండలం చెన్నూరులో కలర్‌షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎక్స్‌పోర్ట్స్), తడ మండలం మాంబట్టులో వీల్స్ ఇండియా లిమిటెడ్, తొట్టంబేడు మండలం తాటిపర్తిలో మంచు కొండ ప్రకాశం ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఈయా మెటల్ అండ్ అల్లాయ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి రెండు పరిశ్రమలు, కేవీబీపురం మండలం కొత్తూరులో బీఎస్ఆర్ సిలిండర్స్ ప్రైవేట్ లిమిటెడ్, చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో టాక్స్‌జెన్ బయోల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.

శ్రీసిటీలోనే 13 పరిశ్రమలు

జిల్లాలో ఈ ఏడాది ఒక్క శ్రీసిటీలోనే ఏకంగా 13 పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. ఎల్జీ పాలిమర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నిండెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియోలింక్ టెలికమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్, జేజీఐ మెటల్ కన్వర్టర్స్, ఎవర్‌షైన్ మాడ్యులర్స్ లిమిటెడ్, ఆటో డేటా, ఎస్కే కాంపొనెంట్స్, అడ్మైర్ కేబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీ లక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేఏ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిడెట్ వంటి పరిశ్రమలు అందులో వున్నాయి.



మే8న ఎల్జీ సంస్థకు మంత్రి లోకేశ్ భూమిపూజ

సీఎం, లోకేశ్‌ల చొరవ

గత ప్రభుత్వ విధానాలతో నత్తనడకన సాగుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లు పరుగులెత్తించారు. రూ. 8949 కోట్ల భారీ పెట్టుబడులతో 19 కొత్త పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటయ్యేందుకు భూములు కేటాయించారు. అవసరమైన అనుమతులు, రాయితీలు మంజూరు చేయించారు. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే జిల్లాలో యువతకు 20,536 ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఈ పరిశ్రమలకు సీఎం చంద్రబాబు 1420 ఎకరాల భూముల కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

కొత్త పరిశ్రమలు ఎక్కడెక్కడంటే....

కొత్తగా జిల్లాలో ఏర్పాటు కానున్న 19 పరిశ్రమలలో కొన్ని భారీ పెట్టుబడులు కలిగిన సంస్థలు వుండగా, మరికొన్నింటిలో భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తొట్టంబేడు మండలం తాటిపర్తిలో అల్యూమినియం ఇంగాట్స్ తయారు చేసే ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన హిండల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 1700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతోంది. శ్రీసిటీలో మాండలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1600 కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఈ పరిశ్రమ చాక్‌లెట్ల తయారీకి ప్రపంచవ్యాప్తంగా పేరుమోసింది. ఇక్కడ తయారయ్యే చాక్లెట్లు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి కానున్నాయి. నాయుడుపేట మండలం పాలచ్చూరు వద్ద బిర్లా కార్బన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1200 కోట్ల పెట్టుబడితో కార్బన్ బ్లాకుల తయారీ యూనిట్ నెలకొల్పుతోంది. ఇదే మండలం మేనకూరులో గ్రేస్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 520 కోట్ల పెట్టుబడితో గ్రెయిన్ బేస్డ్ డిస్టిలరీ ఏర్పాటు చేస్తోంది. గూడూరు మండలం వేదిచెర్లలో రెడ్‌సన్ సీమ్‌లెస్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 437 కోట్లతో స్టీలు పైపుల తయారీ యూనిట్ పెడుతోంది.

ఆ రెండు పరిశ్రమల్లో 12 వేల మందికి ఉపాధి

కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలలో కేవలం రెండింటి ద్వారానే 12 వేల మందికి ఉపాధి కలగనుంది. శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద హిల్‌టాప్ ఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఫుట్ వేర్ తయారీ యూనిట్ నెలకొల్పుతోంది. అపాచీ గ్రూపులో భాగమైన ఈ సంస్థ రూ. 700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలో పది వేల మందికి ఉపాధి లభించనుంది. అలాగే సత్యవేడు మండలం కొల్లడం గ్రామం వద్ద ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ రూ. 380 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీ యూనిట్‌లో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

దుగరాజపట్నం నౌకా నిర్మాణ కేంద్రం



సీఎం చంద్రబాబు చొరవతో దుగరాజపట్నం వద్ద నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీనికి అవసరమైన భూములను గుర్తించే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా నడుస్తోంది. సముద్ర తీర ప్రాంతంలో ఐదు వేల ఎకరాల భూమి అవసరమని కేంద్రం స్పష్టం చేయడంతో జిల్లా యంత్రాంగం గూడూరు నియోజకవర్గ పరిధిలో సముద్ర తీర ప్రాంత భూములు పరిశీలిస్తోంది. అయితే అది షిప్ బిల్డింగ్ సెంటరా లేక షిప్ బ్రేకింగ్ సెంటరా అన్నదానిపై ఇంకా స్పష్టత రావాల్సి వుంది.

ముగిసిన జ్యేష్ఠాభిషేకం



తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం బుధవారం ముగిసింది. చివరిరోజున బంగారు కవచంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి మెరిసిపోయారు. వచ్చే ఏడాది జరిగే జ్యేష్ఠాభిషేకం వరకు ఉత్సవర్లు ఈ స్వర్ణ కవచంలోనే ఉంటారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


వీఆర్‌కు ఇద్దరు ఎస్ఐలు

- ముగ్గురికి పోస్టింగ్ ఇస్తూ ఎస్పీ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఎస్ఐలను వీఆర్‌కు పంపుతూ బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలిచ్చారు. జిల్లాలో కొందరు ఎస్ఐల పనితీరు, వ్యవహారశైలిపై ఇంటెలిజెన్సు, స్పెషల్ బ్రాంచ్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. దీంతో వెంకటగిరి ఎస్ఐ జి.సుబ్బారావు, పాకాల ఎస్ఐ ఎంఎన్ సంజీవరాయుడును వీఆర్‌కు సాగనంపారు. ఇక, తిరుపతి ఈస్ట్‌లో పనిచేసి వీఆర్‌కు వెళ్లిన ఎస్ఐ బాలకృష్ణను ఎర్రావారిపాలేనికి.. తిరుపతి ఈస్ట్‌లోని రామాంజనేయులును తొట్టంబేడుకు, వీఆర్‌లోని మస్తానయ్యను వెంకటగిరికి బదిలీ చేశారు. వీరందరూ తక్షణం వారి స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. మరికొందరు సీఐలు, ఎస్ఐల పనితీరుపై నిఘా ఉంచినట్లు తెలిసింది.

గరుడుడిపై అమ్మవారు.. అయ్యవారు





తిరుచానూరులో పద్మావతిదేవి - అప్పలాయగుంటలో..

తిరుచానూరులో ఐదు రోజులు జరిగిన తెప్పోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పద్మావతి అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగారు. అలాగే, వడమాలపేట మండలం అప్పలాయగుంటలో జరిగే ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో స్వామివారు రాత్రి గరుడుడిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

- తిరుచానూరు/వడమాలపేట, ఆంధ్రజ్యోతి

రెవెన్యూశాఖలో బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెవెన్యూశాఖలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ నోడల్ అధికారి అయిన చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతృత్వంలో జరిగింది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించిన అనంతరం బదిలీల ప్రక్రియ చేపట్టారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి జిల్లాకు, తిరుపతి డీఎస్వో కార్యాలయంలో పనిచేస్తున్న రేఖను చిత్తూరుజిల్లాకు బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 24 మంది డీటీలకు అడహక్ పద్ధతిలో తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాలను కేటాయించారు. వీరిలో తిరుపతి జిల్లాకు.. శాంతి (ఆర్డీవో కార్యాలయం, శ్రీకాళహస్తి), తనూజ (డీఎస్వో కార్యాలయం, తిరుపతి)ను, చిత్తూరు జిల్లాకు కేటాయించిన వారిలో.. రాజేంద్ర (తిరుపతి), శ్రీనివాసులు (తిరుపతి), రాధిక (తిరుపతి) ఉన్నారు.

279మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

- ముగ్గురు డిప్యూటీ ఎంపీడీవోలు కూడా..

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 279 మంది పంచాయతీ కార్యదర్శులు బుధవారం రాత్రి బదిలీ అయ్యారు. గత ప్రభుత్వంలో గ్రేడ్‌తో సంబంధం లేకుండా కార్యదర్శులను నియమించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీలను విభజించింది. ఆ ప్రకారం అర్హులైన కార్యదర్శులను నియమించేలా చర్యలు చేపట్టింది. ఇక, ఇన్‌చార్జిలతో కొట్టుమిట్టాడుతున్న తిరుచానూరు మేజర్ పంచాయతీకి రేణిగుంట పంచాయతీ కార్యదర్శి పీఎస్ మణిని నియమించారు. అలాగే వివిధ మండలాల్లో ఈవోపీఆర్డీ(డిప్యూటీ ఎంపీడీవో)గా పనిచేస్తున్న ముగ్గురు బదిలీఅయ్యారు. సత్యవేడులోని తరుణాక్షరెడ్డిని కేవీబీపురానికి, తిరుపతి రూరల్‌లోని మాధురిని ఎర్రావారిపాళెంకు, వడమాలపేటలోని దయాసాగర్‌ను తిరుపతి రూరల్‌కు బదిలీ చేశారు. జిల్లాలో రెవెన్యూశాఖకు సంబంధించి పది మంది తహసీల్దార్లు, 17మంది డీటీలతోపాటు పలువురు వీఆర్వోలు కూడా బదిలీలయ్యారు. ఈ వివరాలు గురువారం అధికారికంగా వెలువడనున్నాయి. కాగా, ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా విజయవాడలో గురువారం జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు కలెక్టర్, జేసీ బుధవారం బయలుదేరి వెళ్లారు.

స్విమ్స్‌ను అత్యుత్తమ వ్యవస్థగా తీర్చిదిద్దుతాం





వేదికపై టీటీడీ చైర్మన్, చాన్సలర్ బీఆర్ నాయుడు, ముఖ్యఅతిథి హనుమంతరావు, టీటీడీ సభ్యురాలు సుచిత్ర తదితరులు - పట్టా తీసుకునే విద్యార్థులతో ప్రతిజ్ఞ

- స్నాతకోత్సవంలో చాన్సలర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌ను దేశంలో అత్యుత్తమ వ్యవస్థగా తీర్చిదిద్దుతామని స్విమ్స్ చాన్సలర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని మహతిలో బుధవారం జరిగిన స్విమ్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏటా స్విమ్స్‌కు టీటీడీ రూ.వంద కోట్లు వెచ్చిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాల కొరత లేకుండా మరో రూ.71 కోట్ల వరకు వెచ్చించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సేవలు, రోబోటిక్ శస్త్ర చికిత్సలు, ఆన్‌లైన్ ఓపీడీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్విమ్స్‌లో వేల మంది రోగులకు వైద్యసేవలతో పాటు వర్సిటీలో ఏటా వందల మంది వైద్యులను, సిబ్బందిని తీర్చిదిద్దుతుండటం గొప్ప విషయమని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ధనార్జనే ధ్యేయంగా కాకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ప్రాణాలు నిలబెట్టడంలో ప్రతిభ చూపాలని ముఖ్య అతిథి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ హనుమంతరావు డాక్టర్లకు సూచించారు. అధునాతన వైద్య పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించాలని వైద్య విద్యార్థులకు చెప్పారు. అనంతరం వైద్య విద్య పూర్తి చేసుకున్న 501 మందికి డాక్టర్ పట్టాలు, వైద్య విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందికి బంగారు పతకాలు, ఎంబీబీఎస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్లు అభిఘ్న, నికిత గిద్వానికి రూ.25 వేల నగదు బహుమతి, ఎక్కువ మార్కులు సాధించిన డాక్టర్లు నాగేంద్రప్రసాద్, బుద్దగారి ప్రేమ్‌కు మెరిట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రోగులకు నిస్వార్థ సేవ అందిస్తామంటూ డాక్టర్ పట్టాలు అందుకున్న వారితో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంకా టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డీఎంఈ అకడమిక్ డాక్టర్ రఘునందన్, స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, వైద్య విభాగాధిపతులు నరేంద్ర, జానకి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులకు స్థానచలనం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజేందకుమార్‌రెడ్డి సత్యసాయి జిల్లాకు బదిలీకాగా.. ఆయన స్థానంలో కడప నుంచి భరత్‌కుమార్ రెడ్డిని నియమించారు. సమాచార పౌరసంబంధాలశాఖ(ఐఅండ్ పీఆర్) జిల్లా అధికారి బాలకొండయ్యను అనంతపురం జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం, ఆయన స్థానంలో గురుమూర్తిని నియమించింది. ఇక డీపీఆర్వోగా రమేష్ నియమితులయ్యారు.

నేటి నుంచి మోగనున్న బడిగంట

తిరుపతి(విద్య), జూన్ 11: వేసవి సెలవుల విరామం తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో సెలవుల్లో ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ఇక బడిబాట పట్టనున్నారు. జిల్లాలోని 3150 ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు తెరుచుకోబోతున్నాయి. 50 రోజుల విరామం తరువాత సుమారు 3 లక్షల పైచిలుకు విద్యార్థులు పాఠశాలలకు రానున్నారు.

నలుగురు రెవెన్యూ అధికారులపై చర్యలు

- నగరిలో ప్రభుత్వ భూమిని కాపాడకపోవడమే కారణం

చిత్తూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలో ఒకప్పుడు పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలపై చర్యలు తీసుకోమని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై మేజర్ పెనాల్టీ ఇంపోజ్ (కఠిన చర్యలు) చేయమని సీసీఎల్ఏకు సిఫార్సు చేశారు. ఈ నలుగురిలో ప్రస్తుత ఆర్‌సీపురం, వెదురుకుప్పం తహసీల్దార్లు వెంకటరమణ, బాబు, నగరి వీఆర్వో దేవదాసు, రిటైర్డ్ వీఆర్వో సదాశివపిళ్లై ఉన్నారు. వీరికి చార్జ్ మెమోలను ఇచ్చి, విచారణాధికారిని నియమించాక మేజర్ చర్యలు తీసుకుంటారు. ఈ చార్జెస్ ఉన్నంతవరకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందవు. ఇదంతా ఎందుకంటే.. 2018-20 మధ్య నగరి మండలంలో చెరువు, కుంట, దారిని ఆక్రమించి టెంకాయ చెట్లను సాగుచేస్తున్నారని ఓ సర్పంచి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు తమ హయాంలో ఈ నలుగురు అధికారులు చెట్లను తొలగించామని రిపోర్టు ఇచ్చారు. అయితే, చెట్లను తొలగించలేదని లోకాయుక్త విచారణలో తేలింది. ఆ తర్వాత తహసీల్దార్ చెట్లను తొలగించి లోకాయుక్తకు ఫొటోలు, వీడియోసహా నివేదిక ఇచ్చారు. గతంలో స్పందించని నలుగురిపై లోకాయుక్త సీసీఎల్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ ఆదేశాలు వచ్చాయి.

టెక్నాలజీ వినియోగంలో మనమే టాప్



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ కేంద్ర మంత్రికి వివరిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ వాడకంలో ప్రపంచంలోనే మన దేశం ముందుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. తిరుపతిలో బుధవారం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తి మేరకు సాయంత్రం జిల్లా పోలీసు రిజర్వు గ్రౌండుకు వచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్క నాటి మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు డ్రోన్ల వినియోగం, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. డ్రోన్లు పైకి ఎగురవేసి వాటి ద్వారా నేరస్థులు, గంజాయి వినియోగదారులు, రౌడీల ఆటకట్టించడం వంటి చర్యలకు ఎలా ఉపయోగపడుతున్నాయో మంత్రికి ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నేతలు కోలా ఆనంద్, వరప్రసాద్, మునిసుబ్రమణ్యం, ఏఎస్పీలు నాగభూషణం(క్రైం), రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచ్చారి, శ్యాంసుందర్, సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

చంద్రగిరి

ఖరీఫ్‌లో సాగు పద్ధతులపై అవగాహన


సమావేశం మాట్లాడుతున్న అధికారులు

ఎర్రావారిపాలెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి కార్యక్రమంలో భాగంగా బోడేవాండ్లపల్లెలో ఖరీఫ్‌లో సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాస్ నోడల్ అధికారి, శాస్త్రవేత్త దివ్యసుధ, ఐసీఏఆర్ శాస్త్రవేత్త సుమంత్ కుండేలు మాట్లాడుతూ సాగులో విత్తనశుద్ధి కీలకమన్నారు. సాగుకు ముందు మేలైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, భూసార పరీక్షలు విధిగా పాటించాలన్నారు. ఆధునిక సాగులో డ్రోన్ వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్,అధికారులు హరిత,రాజశేఖర్ పాల్గొన్నారు.

అనుపల్లెలో ఘనంగా గంగ జాతర



రామచంద్రాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అనుపల్లిలో బుధవారం వైభవంగా గంగజాతర జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ఘట్టం కుండ ఇంటింటికి వెళ్లి పూజలందుకుంది. అర్ధరాత్రి చేంతాళ్ల గంగమ్మను మట్టితో తయారు చేసి శోభాయమానంగా అలంకరించారు. అక్కడి నుంచి మేళతాళాల నడుమ ఊరేగించారు. గ్రామస్థులు అమ్మవారికి వేటపొంగళ్ల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఉత్కంఠగా బలి సాగింది.

బైరాగి వేషంలో గంగమ్మ దర్శనం



చంద్రగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు బైరాగి వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, బైరాగి వేషం అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు బండారు భారతి సుబ్బారెడ్డి, ఉగ్రాణం లక్ష్మీగురవారెడ్డి, చంద్రగిరి ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పథకాలు అందాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పేదల సంఘ నేతలు

పాకాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని గ్రామీణ పేదల సంఘం మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. బుధవారం పాకాలలో ర్యాలీ నిర్వహించి సభ జరిపారు. సభలో గ్రామీణ పేదల సంఘం మండల కార్యదర్శి ఎం.ప్రభాకర్ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.భాస్కర్, గ్రామీణ పేదల సంఘం రాయలసీమ రీజనల్ కార్యదర్శి కృష్ణారెడ్డి, అనంతపురం జిల్లా కన్వీనర్ నాగభూషణం, సీనియర్ అడ్వొకేట్ రాజాశ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ వ్యవసాయాలనికి అనుకూలంగా వున్న ఫారెస్ట్, బంజరు భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

భాకరాపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. భాకరాపేట, చట్టేవారిపాళెం గ్రామాల్లో రూ.30.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. బొమ్మ చెరువుపల్లె నుంచి మంగళంపే రోడ్డును కలుపుతూ తారు రోడ్డు కావాలని మాజీ కన్వీనర్ బెల్లంకొండ రమణ కోరగా అధికారుల ద్వారా త్వరలోనే సర్వే చేయిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, ప్రధాన కార్యదర్శి మదనమోహన, శివకుమార్, ఆర్వీ రమణారెడ్డి, చిట్టెమ్మ, సుబ్రహ్మణ్యం, మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పాకాల:** రవణయ్యగారిపల్లె, మొగరాల, ఊటువంకలలో రూ.3.22 కోట్లతో నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, నాయకులు బి.మదునాయుడు, ఆర్.ఆనందచౌదరి, సిద్దయ్యనాయుడు, శ్రీనివాసులు నాయుడు, బాలశంకర్, ఎం.వెంకటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకే తోతాపురి కొనుగోలు చేయాలి


రైతులు, సప్లయర్స్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో

పాకాల, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తోతాపురి మామిడి కాయలు సప్లయర్లు, గుజ్జుపరిశ్రమ యజమానులు కొనుగోలు చేయాలని ఆర్డీవో రామ్మోహన్ ఆదేశించారు. బుధవారం ఆయన మ్యాంగోనగర్‌లో తోతాపురి మామిడి కాయలు పరిశీలించారు. సప్లయర్లు, వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. తోతాపురి మామిడికాయలకు ప్రభుత్వం రూ.12వేలు టన్నుకు ప్రకటించిందన్నారు. గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంపులవద్ద వ్యాపారులు టన్నుకు రూ.8వేలు చెల్లిస్తే ప్రభుత్వం టన్నుకు రూ.4వేలు రైతులకిస్తుందన్నారు. నిర్ణయించిన ధరకంటే తక్కువ చెల్లించి కొనుగోళ్లు చేస్తే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ సుదర్శన ప్రసాద్, తహశీల్దార్ సంతోష్‌సాయి పాల్గొన్నారు.

గేట్‌వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథా


వృథాగా పోతున్న నీరు

తిరుపతిరూరల్, మే11(ఆంధ్రజ్యోతి): కేసీపేట పంచాయతీ భాగ్యనగరంలో ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్ పైపుకి గేట్‌వాల్వ్ వద్ద లీకేజీ సమస్యతో నీరువృథాగా పోతుంది. ఈనీరు రోడ్డుపైకి, పక్కనే ఉన్న గుంతలోకి చేరుతోంది. దీంతో అటువైపుగా ప్రయాణించే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రామానుజపల్లెలోని ఎంపీపీస్కూల్‌కి సమీపంలోని తాగునీటి పైపు పగిలిపోవడంతో నీరువృథాగా పోతుంది. ఇదే గ్రామంలో రామాలయం వెనుకవైపు తాగునీరు పైపులైన్ లీకేజీ సమస్యతో కూడా నీరువృథాగా పోతుందని గ్రామస్థులు అంటున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కాలూరులో గంగమ్మతల్లి పునఃప్రతిష్ట



తిరుపతి రూరల్, మే11(ఆంధ్రజ్యోతి): సి.మల్లవరం పంచాయతీ కాలూరు పాత హరిజనవాడలో బుధవారం గంగమ్మతల్లి పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అంబలి పోసి అమ్మవారికి మొక్కు చెల్లించారు. సర్పంచ్ మొక్కల భారతి, తిమ్మారెడ్డి దంపతులు పసుపు, కుంకుమ, ఫలాలతో కూడిన సారెని సమర్పించారు. మహిళలకు గాజులు, జాకెట్లు, పసుపుదారాలని పంపిణీ చేశారు


మహిళలకు నీటి బిందెలు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాని


కోదండరామపురంలో సీసీ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాని

రామచంద్రాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి అభివృద్ధితో పాటు సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నాని అన్నారు. కోదండరామపురంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు రూ.6.5కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జనార్ధనచౌదరి, మునిరామిరెడ్డి, ఉమాపతినాయుడు, హరిప్రసాద్ పాల్గొన్నారు. **ఎర్రావారిపాలెం:** అభివృద్దే టీడీపీ ప్రభుత్వ నినాదమని ఎమ్మెల్యే నాని అన్నారు. రూ.5 కోట్లతో నిర్మించిన ఎర్రావారిపాలెం-అప్పిరెడ్డిరెడ్డిగారిపల్లె డబుల్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.20 కోట్లతో తలకోన వాటర్‌ఫాల్స్ నీటిని చిన్నగొట్టిగల్లు,ఎర్రావారిపాలెం మండలాల చెరువులకు అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో రామమోహన్‌రావు,అధికారులు, నాయకులు పాల్గొన్నారు. **చంద్రగిరి:** పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇందుకు ఎమ్మెల్యే నాని చొరవ తీసుకున్నారు. ఈక్రమంలో బీడీ కాలనీలో సుమారు రూ.12 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు తాగునీటి పైప్‌లైన్ అమర్చారు. ద్వారకానగర్‌లో రూ.142 లక్షలతో ఓవర్ హెడ్ నిర్మాణం పూర్తి చేయించారు. ఈరెండింటినీ బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తాగునీటి కుళాయిలను ప్రారంభించి మహిళలకు నీటి బిందెలను అందించారు. డీసీఎంస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు, జడ్పీటీసీ యుగంధర్, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, నాయకులు బాలకృష్ణమూర్తి, ప్రవీణ్ రాయల్, భాస్కర్, గురుమూర్తిరెడ్డి, వెంకటరెడ్డిఽ పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా రామరాజు



పాకాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పాలగిరి రెడ్డి రామరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఐరాల కళాశాల నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి ఐరాలకు బదిలీ అయ్యారు. రామరాజుకు కళాశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి సేవలో శ్రీనివాసరాజు



తిరుమల, జూన్11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ, టీటీడీ మాజీ జేఈవో శ్రీనివాసరాజు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, జూన్11(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. సోమవారం హుండీ ఆదాయం రూ.4.30 కోట్లు లభించింది. మంగళవారం శ్రీవారిని 80,894 మంది భక్తులు దర్శించుకున్నారు.32,508 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

తిరుమల ఎక్సైజ్ సీఐగా లక్ష్మణరావు



తిరుమల, జూన్11(ఆంధ్రజ్యోతి): తిరుమల ఎక్సైజ్ సీఐగా లక్ష్మణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్ష్మణరావు మీడియాతో మాట్లాడుతూ.. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఎక్సైజ్ నేరాలను అరికట్టడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కర్ణాటక సీఎంను కలిసిన టీటీడీ చైర్మన్


సీఎంను సత్కరిస్తున్న బీఆర్ నాయుడు

తిరుమల, జూన్11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బెంగళూరులోని సీఎం నివాసంలో సిద్ధరామయ్యను కలిసి శ్రీవారి వస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీవారి భక్తులకు టీటీడీ కల్పిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలపై సీఎం సిద్ధారామయ్య హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ నాయుడితో పాటు బోర్డు సభ్యులు నరేష్, కర్ణాటక మంత్రి దినేష్ గుండూరావ్, రఘునాథ్ నాయుడు తదితులు ఉన్నారు.

కారు ఢీ కొని ఒకరి మృతి


జ్ఞానేంద్ర (ఫైల్ ఫొటో)

వడమాలపేట,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో కారు ఢీ కొని వడమాలకు చెందిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పుత్తూరు నుంచి తిరుపతి వెళ్తున్న కారు వడమాలపేట నుంచి టోల్‌గేట్ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకోంది. బైక్ నడుపుతున్న జ్ఞానేంద్రకుమార్(21) తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి చెప్పారు.

వేడుకగా గంగజాతర

తిరుచానూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో బుధవారం రాత్రి గంగజాతర వేడుకగా ముగిసింది. గ్రామదేవత పొక్కాలమ్మ ఆలయం వద్ద భక్తులు పెద్దసంఖ్యలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విశేషాలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు

ట్రై సైకిల్‌లో చున్నీ తగులుకొని దివ్యాంగురాలి మృతి

చిట్టమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ట్రై సైకిల్‌లో చున్నీ తగులుకొని దివ్యాంగురాలు మృతి చెందిన ఘటన మండల పరిధి లోని తాడిమేడు రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... నాయుడుపేట మండలం, గొట్టిప్రోలు అగచాట్లపురం కాలనీకి చెందిన దివ్యాంగురాలు పోలమ్మ(36) మరో దివ్యాంగుడితో కలసి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌లో కొత్తగుంటకు వెళ్లింది. తిరిగి అగచాట్లపురం గ్రామానికి వెళ్తుండగా తాడిమేడు రోడ్డు సమీపంలో పోలమ్మ మెడకు ఉన్న చున్నీ సైకిల్ చక్రానికి తగులుకొని బోల్తా కొట్టింది. చున్నీ పోలమ్మ మెడకు బిగుసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

ముగిసిన అమ్మవారి తెప్పోత్సవాలు



తెప్పోత్సవాల సందర్భంగా కాంతులీనుతున్న పద్మసరోవరం- సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు

తిరుచానూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఐదు రోజులుగాజరుగుతున్న పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. మధ్యాహ్నం అమ్మవారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారిని పుష్కరిణివద్దకు వేంచేపు చేసి తెప్పలపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఏడు చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. రాత్రి వేడుకగా గరుడ వాహన సేవ జరిగింది. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏవీఎస్వో శైలేంద్రనాథ్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఆగి..సాగిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

- స్పౌజ్ అంశంలో సమస్యలు
- ఉపాధ్యాయ సంఘ నేతలతో డీఆర్వో చర్చలు


డీఆర్వో మోహన్ కుమార్ ఆధ్వర్యంలో టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ అభ్యంతరాల నడుమ సాగుతోంది. రావాల్సిన పాయింట్లు రాకపోవడంతో అర్హత ఉన్నా, అనుకూల ప్రాంతాలు రాలేదంటూ టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కౌన్సెలింగ్ ప్రక్రియలో పలు అభ్యంతరాలు లేవనెత్తారు.చిత్తూరు షర్మన్ మెమోరియల్ బాలికల పాఠశాలలో మంగళవారం రాత్రి 10.50 గంటలకు డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన మొదలైన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ బుధవారం తెల్లవారుజాము 3 గంటల వరకు సాగింది. 203మంది ఎస్జీటీలకు బదిలీలు పూర్తి చేశారు. 204వ టీచర్ బదిలీ వచ్చే సరికి స్పౌజ్ సమస్య తలెత్తడంతో దాన్ని నివారించడానికి ఉదయం 6.45 గంటలైంది. ఆపై కొనసాగుతూ ఉదయం 10.50 గంటల వరకు 212 వరకు చేరుకుంది. తర్వాత కూడా స్పౌజ్ అంశంలో సమస్యలు తలెత్తడం విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది.మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉపాధ్యాయ సంఘాల నేతలకు విద్యాశాఖాధికారుల మధ్య వాదనలు సాగాయి. సమస్య తీవ్రతరం కావడంతో డీఈవో వరలక్ష్మి పరిస్థితులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు దృష్టికి తీసుకుపోయారు. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్వో మోహన్ కుమార్ రంగంలోకి దిగారు. దాదాపు 45 నిమిషాల పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు లేవనెత్తిన పలు సమస్యలపై డీఈవోతో పాటు ఫోన్లో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌తోనూ సమీక్షించారు. ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన అంశాలు సరైనవి కావని స్పష్టం చేశాక కౌన్సెలింగ్ సజావుగా జరిగేలా చూడాలని కోరారు.దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు ఉపాధ్యాయులు తమకు బదిలీ వద్దంటూ వెళ్లిపోయారు. డీఆర్వో దగ్గరుండి బదిలీ ప్రక్రియను కొనసాగించడంతో రాత్రి 7.15 గంటల వరకు 350 మంది టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ పూర్తయింది. ఆపై 351 నుంచి 500 వరకు బదిలీ కౌన్సెలింగ్ కొనసాగించారు. గురువారం ఉదయం 11 గంటలకు 501 నుంచి వెయ్యి మంది వరకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి ప్రకటించారు.తిరుపతి డీఈవో కుమార్, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య డీవైఈవోలు, చిత్తూరు ఏడీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

తోతాపురి రైతులకు దక్కని ఊరట

- దగా చేస్తున్న దళారులు- గుజ్జు పరిశ్రమలు


ధరలు లేక రోడ్డు ప్రక్కన పడేసిన మామిడి

పాకాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దళారుల సిండికేట్, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు గుజ్జు పరిశ్రమలు కొనుగోళ్లు చేయకపోవడంతో తోతాపురి రైతులకు ఊరట లభించలేదు. దళారులు- గుజ్జు పరిశ్రమల యజమానుల లోపాయికారి ఒప్పందాలతో తోతాపురి టన్ను రూ.4వేల నుంచి రూ.5 వేల లోపే కొంటున్నారు. ర్యాంపు యజమానులు, దళారులు తమిళనాడులో తక్కువ ధరకే తోతాపురి వస్తుందని నమ్మబలుకుతున్నారు. ర్యాంపుల వద్ద టన్ను తక్కువ రేటుకు కొని బయట వ్యాపారులకు టన్ను రూ. 6వేల నుంచి రూ.7వేల వరకూ విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. టన్ను కాయల కోత కూలీ, రవాణా ఖర్చులు రూ.2.5వేలకు పైగా ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో రూ.4 వేలకు ఎలా విక్రయించాలంటూ అల్లాడిపోతున్నారు. ఓ వైపు పక్వానికి వచ్చిన కాయలు రాలిపోతుంటే గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర రూ.8 వేలకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మా తోతాపురిని అనుమతించండి

- ఏపీ సీఎస్‌కు కర్ణాటక లేఖ

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో తోతాపురి మామిడిసాగు చేసే రైతులకు షాక్ తగిలింది. ఇక్కడి నుంచి తరలివెళ్లే మామిడిని చిత్తూరు జిల్లాలోకి అనుమతించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కర్ణాటకలో అత్యధికంగా కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకాలో మామిడిసాగు చేస్తారు. చిత్తూరు జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమలకు విక్రయిస్తారు. అయితే ఇతర రాష్ట్రాల తోతాపురి మామిడి చిత్తూరు జిల్లాలోకి రానివ్వకుండా అడ్డుకుంటుండడంతో నష్టపోతున్నామంటూ కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల రైతులు ప్రభుత్వానికి విన్నవించారు. చిత్తూరు జిల్లాలో మామిడిపంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈనేపథ్యంలో కర్ణాటక చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఒక లేఖ పంపారు. కర్ణాటక రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

దర్జాగా అక్రమ నిర్మాణం


హైవే పక్కన రేకుల షెడ్ నిర్మాణం

చంద్రగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కూడలిలోనఇ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. కూడలిలో తిరుపతికి వెళ్లే సర్వీసు రోడ్డుకు ఆనుకుని కొంత ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మించాలని నిర్ణయించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటుచేశారు. ఈ స్థలంలో పక్క స్థల యజమాని దర్జాగా రేకులు వేసి టిఫిన్ అంగడికి అద్దెకు ఇచ్చాడు. అక్కడితో ఆగక శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమంగా గోడలు నిర్మించి రేకుల షెడ్డు వేశారు. విద్యుత్ ట్రాన్సఫార్మర్‌కు సపోర్టుగా ఓ విద్యుత్ స్తంభమున్నా దానిపైనా నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఆలయ నిర్మాణం కూల్చివేతపై ఆందోళన


అమ్మవారి విగ్రహంతో ధర్నా చేస్తున్న నిర్వాహకులు

తిరుచానూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని స్వర్ణముఖి తీరంలో సర్వే నెంబరు 458లో గంగిరెడ్డి కుటుంబానికి మరో వ్యక్తికీ మధ్య భూవివాదం తీవ్రమైంది. కొంతకాలం క్రితం ఇక్కడ గుడిసె వేసి కొండబాబు అనే వ్యక్తి వారాహి అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి ఆలయాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ స్థలం విషయంలో ఇతనికి,గంగిరెడ్డి సభ్యుల మధ్య వివాదం నడుస్తోంది. ఈనేపథ్యంలో ఇటీవల గుడిసెను పాక్షికంగా ధ్వంసం చేశారు. దీంతో కొండబాబు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రామిరెడ్డి, మణిరెడ్డి తదితరులపై కేసు నమోదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి కొంతమంది విగ్రహంతో పాటు కొన్ని వస్తువులను స్వర్ణముఖిలో పడవేసి గుడిసెను తొలగించారు. ఆ స్థలాన్ని చదును చేసేశారు. బుధవారం ఉదయం కొండబాబు, అతని కుటుంబ సభ్యులు వెళ్లి స్వర్ణముఖిలో పడిఉన్న అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి తిరుచానూరు రోడ్డులో బైఠాయించారు. భజరంగదల్ నేత విష్ణు ప్రతీక్, మరికొన్ని హిందు సంఘాలు ఇతనికి మద్దతుగా ఆందోళన చేశారు. పోలీసులు వారిని పంపించేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. కాగా సదరు స్థలం స్వర్ణముఖి వంక పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిలిపారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి, డీటీవో మురళీమోహన్

డీటీవో కార్యాలయ ఏవోగా విజయకుమార్



విజయకుమార్

తిరుపతి(జీవకోన), జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయ పరిపాలన అధికారిగా విజయకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కార్యాలయ ఏవోగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు మదనపల్లెకు బదిలీ అయ్యారు. మదనపల్లె నుంచి తిరుపతికి వచ్చిన విజయకుమార్ బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసులును డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి, డీటీవో మురళీమోహన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంవీఐ అతికానాజ్, ఏవో విజయప్రశాంతి, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి

ఎమ్మెల్యేకు గ్రామస్తుల మొర



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

తిరుపతి అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కలుషిత నీటితో అనారోగ్యం పాలవుతున్నామని, ఆర్వో వాటర్ ఏర్పాటు చేయాలని మంగళంలోని చెన్నాయిగుంట గ్రామ మహిళలు ఎమ్మెల్యే నానికి మొరపెట్టుకున్నారు. బుధవారం ఉదయం ఆయన తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని కేబీఆర్ నగర్‌కు వెళ్లే మార్గంలో రూ.20లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని, రూ.చెన్నాయిగుంట గ్రామానికి రూ.36 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. దొంగల బెడద ఎక్కువగా ఉందని, మందుబాబుల ఆరాచకాలు భరించలేకున్నామని, రేషన్‌షాపు స్థానికంగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రెండు గ్రామాల మహిళలు కోరారు. ఆరునెలల్లో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భూ దందాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పద్మావతి జూనియర్ కాలేజీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా జూనియర్ కాలేజీలోని నలుగురు విద్యార్థినులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఒక్కొక్కరు రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ అవార్డులు పొందిన వారిలో గంగామానస, నందలక్ష్మి, పద్మిత, ఇందుప్రియ ఉన్నారు. వీరిని టీటీడీ డీఈవో వెంకటసునీల్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరస్వతి, వార్డెన్ స్నేహలత, అధ్యాపకులు అభినందించారు.

ఎస్వీయూ గ్రంథాలయానికి భగవద్గీత వితరణ



సురేంద్రబాబుకు భగవద్గీత అందజేస్తున్న వివేక్ చౌదరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయానికి మైసూరు దత్తాత్రేయ పీఠాధిపతి గణపతి సచ్చిదానంద వ్యాఖ్యాన సహిత భగవద్గీత ప్రతులను అందజేశారు. భగవద్గీత మూడు సంపుటాలను ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయాధికారి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబుకు యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి పుస్తక ప్రతులను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిగమ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు నాదముని, మదన్ తదితరులు పాల్గొన్నారు.

జార్జియా నేషనల్ యూనివర్సిటీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాలాజీ కాలనీలో ఏర్పాటుచేసిన జార్జియా నేషనల్ యూనివర్సిటీ పరిపాలన కార్యాలయాన్ని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. తిరుపతి ప్రాంతంలోని విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి, తిరుపతి కార్యాలయ నిర్వాహకులు కృష్ణమోహన్, స్వరప్రపూర్ణ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి స్వాగత సత్కారం



బండి సంజయ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను స్థానిక బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చారు. పార్టీ నాయకులు మంత్రికి రోజామాలవేసి స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, గుండాల గోపినాథ్‌రెడ్డి, మల్లారపు రవి తదితరులు పాల్గొన్నారు.

సమాచార పౌరసంబంధాల శాఖ ఏడీగా వేలాయుధం



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమాచార పౌరసంబంధాల శాఖ తిరుపతి సహాయ సంచాలకులుగా ఎన్.వేలాయుధం బుధవారం కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఏడీగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై తిరుపతికి వచ్చారు.

తిరుపతి

గుజిరీ వ్యాపారుల సంఘం నగర కార్యవర్గం





తిరుపతి (ఆటోనగర్), జూన్11 (ఆంధ్రజ్యోతి): గుజిరీ వ్యాపారుల నగర నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బైరాగిపట్టెలో గుజిరీ వ్యాపారుల నగర మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.బాలన్, కార్యదర్శిగా ఎమ్.అజీమ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్‌డీ రవి, కోశాధికారిగా ఎస్.సుభాన్, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, సహాయ కార్యదర్శులుగా షుకూర్, మహబూబ్‌బాషాతో పాటు 9 మంది సభ్యులు ఎన్నికయ్యారు. సంఘం జిల్లా నేత అల్లాబకష్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. పోలీసుల వేధింపులు ఆపాలని, గుజిరీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రక్షణ కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు.

భూమికోసం దౌర్జన్యం చేస్తున్నారు

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): గతంలో తమకు విక్రయించిన భూమిని తిరిగి ఇచ్చేయాలని దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ తిరుపతి రూరల్ మండలం పేరూరుకు చెందిన మాధవి వాపోయారు. ప్రెస్‌క్లబ్‌లో ఆమె బుధవారం మాట్లాడుతూ పేరూరు గ్రామంలో తాము కొనుగోలు చేసిన 98 సెంట్ల భూమిని తిరిగి ఇచ్చేయాలని శివప్రసాద్ అనే వ్యక్తి రౌడీలను తీసుకువచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంపై గతంలో అధికారులకు, ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బలిజలను బీసీ జాబితాలో చేర్చాలి

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాన ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల ఆ కులాల వారు పూర్తిగా వెనుకబడిపోయారన్నారు. రిజర్వేషన్ అమలుకు మంగళవారం చిత్తూరు నుంచి అమరావతికి చేపట్టిన శాంతియుత పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

దేశాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

● కేంద్రమంత్రి బండి సంజయ్



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి సంజయ్

తిరుపతి(విద్య), జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని, అందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతిలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బండి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. గతేడాది దేశం మొత్తంలో 25 కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటు చేయగా వాటిలో 8 ఏపీలోనే ఏర్పాటు చేసిందన్నారు. తిరుపతిలో ఐఐటీ, ఐషర్‌కు సొంత భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అమరావతి- కాకినాడ-తిరుపతి- విశాఖ నగరాలను స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపిక చేశారని, చెన్నై-బెంగళూరు, విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లుగా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయంగా ప్రకటించారని, కడప విమానాశ్రయానికి కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణానికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారని వివరించారు. చిత్తూరు-తచ్చూర్, బెంగళూరు-కడప-విజయవాడ కారిడార్లు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ అభివృద్ధికి రూ.3,984 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి ఇంతటితో ఆగిపోకూడదంటే రాబోయే కాలంలోనూ ఎన్‌డీఏను ఆదరించాలని, మోదీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన కంచి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుని, పోలీసు గౌరవ వందనం స్వీకరించి పోలీస్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అంతకుముందు మోదీ పాలనపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, తిలకించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు, బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కోలా ఆనంద్, నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, ఇతర నాయకులు భవానీశంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ అరెస్టు

● రూ.1.48 లక్షలు, ల్యాప్‌టాప్ స్వాధీనం
● కారు షోరూములు, షాపింగ్ మాల్స్ లక్ష్యంగా దొంగతనాలు
● ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లో పదేళ్లుగా కార్ల షోరూంలు, షాపింగ్ మాల్స్‌ను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ మంగళ్ సింగ్ చౌహాన్‌ను తిరుపతి క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ 1.48 లక్షలు నగదు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం న్యూహార్ సూద్ తాలూకా, జునాపని గ్రామానికి చెందిన మంగళ్ సింగ్ చౌహాన్, అతడి బంధువులు రాహుల్, కిషన్, అక్షయ్ ఈనెల 3, 4 తేదీల్లో తిరుపతి పట్టణ, రూరల్ పరిధిలోని మారుతీ కార్ల షోరూముల్లో దోపిడీకి పాల్పడి, రూ.5 లక్షలు అపహరించారు. వీరిని పట్టుకోవడానికి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు శ్యాంసుందర్, భక్తవత్సలం, క్రైం సీఐలతో ప్రత్యేక బృందాలను నియమించారు. దోపిడీ జరిగిన ప్రదేశంలోని ఫింగర్ ప్రింట్లను సేకరించి.. పోలీసుల వద్ద ఉన్న పాత నేరస్థుల వేలిముద్రలు, కనుబొమ్మలతో పరిశీలించారు. దీంతో జునాపని గ్రామానికి చెందిన దోపిడీదారుడు రాహుల్ వేలిముద్ర సరిపోయింది. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి.. న్యూహార్‌సూద్ పోలీసులతో కలిసి వారం రోజుల పాటు నిఘా ఉంచారు. ప్రధాన నిందితుడు మంగళ్ సింగ్ చౌహాన్ వాడుతున్న ఫోన్ నెంబరు, అతడి సంభాషణ రికార్డులు ట్రాప్ చేశారు. ఈ క్రమంలో బుధవారం తిరుపతికి సమీపంలోని ఉప్పరపల్లి క్రాస్ వద్ద క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి మంగళ్ సింగ్ చౌహాన్‌ను అరెస్టు చేశారు. చోరీకి గురైన రూ.5 లక్షల్లో దాదాపు రూ.1.48 లక్షలను అతడి నుంచి పోలీసులు రికవరీ చేశారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన సీసీఎస్ సీఐలు చిన్న పెద్దయ్య, ప్రకాష్ కుమార్, శివకుమార్ రెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ రెడ్డి, ఏఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుళ్ళు రవిప్రకాష్, మునిరాజా, కానిస్టేబుళ్ళు నాగరాజు, మోహన్, మునిరత్నం, పురంధర, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య

తిరుపతి(జీవకోన)/తిరుపతి అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగర పరిధిలోని 1వ డివిజన్ పద్మావతినగర్‌లో నిర్మించిన ఎంపీపీ స్కూల్‌ను బుధవారం కమిషనర్ మౌర్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఏడాది లోపే పాఠశాల నిర్మాణం పూర్తిచేసి, ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పథకం ద్వారా 5 నుంచి పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పేదరికం చదువుకు అడ్డుకాకూడదని తల్లికి వందనం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డ్రాపౌట్స్‌ను పూర్తిగా నియంత్రించేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ తిమ్మినాయుడుపాళెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలగించిన స్కూలుకు ప్రత్యామ్నాయంగా చింతలచేను వద్ద నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, డీఈ రమణ, టీడీపీ నేతలు నరేష్ రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, జనసేన నేతలు రాజారెడ్డి, బాబ్జి, మురళి పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

● ఎఫ్‌సీలు పొందిన బస్సుల సంఖ్య 1,100 ● పొందాల్సినవి 600
● త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్న డీటీవో



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు

తిరుపతి(జీవకోన),జూన్11(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన బస్సుల ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందాలని జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ కోరారు. జిల్లా పరిధిలోని తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, గుడూరు, సూళ్లూరుపేట పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,700 బస్సులున్నాయని, వీటికి మే 15 నాటికి ఫిట్నెస్ సర్టిఫికెట్ గడువు ముగుస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 1,100 బస్సులు మాత్రమే సర్టిఫికెట్లు పొందాయని, 600 పొందాల్సి ఉందని చెప్పారు. ఫిట్నెస్‌తోపాటు ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగితే సీజ్ చేయడమే గాక జరిమానా విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏపీ మోటార్ వెహికల్ రూల్ 186-జి ప్రకారం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ల బస్సులు ప్రత్యేక నిబంధనలు పాటించాల్సి ఉందని, ప్రస్తుతం ఆ ప్రక్రియ మేరకు తనిఖీ చేసి, సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే యాజమాన్యాలకు సూచనలు చేశామని, త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.







తిరుమల శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకంలో భాగంగా చివరి రోజైన బుధవారం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, స్వర్ణకవచాలకు పూజలు - మహాశాంతి హోమం, ఉత్సవర్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు

నేడు, రేపు బస్సు పాసుల జారీ నిలిపివేత

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు పాసుల జారీ ప్రక్రియ గురు, శుక్రవారాల్లో తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు డిప్యూటీ సీటీఎం విశ్వనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో కౌంటర్‌ను క్లోజ్ చేసినట్లు పేర్కొన్నారు. 14వ తేదీ(శనివారం) నుంచి యథావిధిగా జారీ చేస్తామని తెలిపారు.

మందకృష్ణ సత్కార సభను జయప్రదం చేయండి

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 19న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సత్కార సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు.

రేపు, ఎల్లుండి బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఈ నెల 13, 14 తేదీల్లో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి ఆడిటోరియంలో సంగీత విభావరి అంకితం నీకే అంకితం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ సంస్థ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సొసైటీ సభ్యులతో కలిసి ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన మధుర గీతాల ఆలాపన, జ్ఞాపకాలకు గుర్తుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జూలై 6 నుంచి నెల్లూరులో రొట్టెల పండుగ

5 రోజుల పాటు నిర్వహణకు సన్నాహాలు

నెల్లూరు (సిటీ), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా, రాష్ట్ర పండుగగా నెల్లూరులో ఏటా జరిగే బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ జూలై 6వ తేదీన ప్రారంభం కానుంది. ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకను విజయవంతంగా పూర్తి చేసేందుకు బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్ అధికారులతో సమీక్షించారు. గత లోపాలను గుర్తించి ఈసారి ముందస్తు జాగ్రత్తలతో భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని వారు అధికారులకు సూచించారు. పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, ఆహారం, వసతి వంటి సౌకర్యాలలో ఎక్కడా లోపాలు రానివ్వకుండా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఆదేశించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన మరోసారి సమీక్ష నిర్వహించి మెరుగైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఈ వేడుకకు ప్రత్యేకాధికారిగా నెల్లూరు ఆర్డీవో అనూష వ్యవహరిస్తారని ఈ సందర్భంగా ప్రకటించారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్స



రోగిని డిశ్చార్జి చేస్తున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): చెయ్యి భాగం పూర్తిగా నీలి రంగులోకి మారి తీవ్రమైన నొప్పితో రుయాస్పత్రికి వచ్చిన వ్యక్తికి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి నయం చేశారు. సూపరింటెండెంట్ రాధ తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన శ్రీనివాసులు(37) ఎడమ చేయి భాగం పూర్తిగా నీలిరంగులోకి మారిపోయింది. తీవ్రమైన నొప్పితో రుయాస్పత్రికి వచ్చాడు. సీటీ సర్జరీ విభాగం వైద్యులు కళ్యాణి రమ, సనా రోహితలు పరీక్షించగా రక్తం పూర్తిగా గడ్డకట్టి సరఫరా కాకపోవడాన్ని గుర్తించారు. అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. రక్తనాళాలను సరిచేయడమేగాక రక్తం పలుచబడే మందులు ఇవ్వడంతో నొప్పి తగ్గడమేగాక చేయి సాధారణ రంగుకు వచ్చింది. పూర్తిగా కోలుకున్న రోగిని బుధవారం డిశ్చార్జి చేశారు. అనుభవం కలిగిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండటం వల్ల అరుదైన చికిత్సను విజయవంతం చేయగలుగుతున్నామని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ, డాక్టర్లు పద్మ, జ్ఞాపిక తదితరులు పాల్గొన్నారు.

చోరీకి బాధ్యులైన వారిని శిక్షించాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ హెచ్-బ్లాక్ హాస్టల్లో చోరీకి పాల్పడిన వారిని గుర్తించి శిక్షించాలని ఎస్ఎఫ్ఐ కోరింది. ఇది యూనివర్సిటీ సిబ్బంది పనే అయి ఉంటుందని ఎస్ఎఫ్ఐ వర్సిటీల కో-కన్వీనర్ అశోక్ అనుమానం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో భద్రతను పటిష్టం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.



అర్బన్‌హెల్త్ సెంటర్ నిర్మాణానికి చర్యలు: పాశం



అసంపూర్తిగా ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనం

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమసీదు ఎదురుగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించడానికి అవసరమైన రూ.36 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేయించి భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందని, హెల్త్ సెంటర్ భవనాన్ని పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమసీదు ఎదురుగా గతంలో ఉన్న ఫైలేరియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైసీపీ ప్రభుత్వంలో ఆ భవనాన్ని తొలగించారు. ఆ స్థలంలో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించడానికి 2021 మార్చి 10వ తేదీన శంఖుస్థాపన చేశారు. అయితే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయక పోవడంతో ఈ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ భవనాన్ని పూర్తి చేసి వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందిన క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా రాణించి గూడూరుకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 రోజులు పాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామీణ స్థాయిలో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. స్టేడియాన్ని అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. నూతనంగా గ్యాలరీ, ఓపెన్‌జిమ్, ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టి క్రీడాకారులకు వసతులను మెరుగుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మునిగిరీష్, వేగూరు రాజేంద్రప్రసాద్, లవకుమార్, తూపిలి నాగేశ్వరరావు, దశరధరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, పేటీటీ చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై దుష్ప్రచారం తగదు

పెళ్లకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధాని అమరావతిని పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తుంటే... వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం చిల్లకూరు, పాలచ్చూరు పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు ద్వారా నాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అక్కరపల్లి మాధవరెడ్డి, ఆకుతోట రమేష్, దామేర ప్రసాద్ నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందమూడి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



నిమ్మసాగులో మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు తిరుపాల్, బండెప్ప

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చునని వెంకటగిరికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ తిరుపాల్ అన్నారు. బుధవారం మండలంలోని పారిచెర్ల గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి నిమ్మ రైతులకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనిక ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం దెబ్బతింటుందన్నారు. కేంద్ర వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ బండెప్ప మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష చేసుకుని, అందుకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్ర మంలో ఏవో రమేష్, శివ, మమత, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచరణల నడుమ శాస్త్రోపేతంగా కల్యాణం జరిపారు. అనంతరం స్వామివారిని గజ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. బుధవారం ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకులో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ప్రసూన, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, సూర్ణకాతం, గౌరీ, షైలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రై సైకిల్‌లో చున్నీ తగులుకొని దివ్యాంగురాలి మృతి

చిట్టమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ట్రై సైకిల్‌లో చున్నీ తగులుకొని దివ్యాంగురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తాడిమేడు రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... నాయుడుపేట మండలం, గొట్టిప్రోలు అగచాట్లపురం కాలనీకి చెందిన దివ్యాంగురాలు పోలమ్మ(36) మరో దివ్యాంగుడితో కలసి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌లో కొత్తగుంటకు వెళ్లింది. తిరిగి అగచాట్లపురం గ్రామానికి వెళ్తుండగా తాడిమేడు రోడ్డు సమీపంలో పోలమ్మ మెడకు ఉన్న చున్నీ సైకిల్ చక్రానికి తగులుకొని బోల్తా కొట్టింది. చున్నీ పోలమ్మ మెడకు బిగుసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు

నాయుడుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్‌కం సెంటర్ వద్ద జరిగిన చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. గతేడాది డిసెంబరు 27వ తేదీన వెల్‌కం సెంటర్‌లో చోరీ జరిగింది. ఈ కేసులో తొట్టంబేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకటేష్, నాయుడుపేట పట్టణానికి చెందిన సతీష్‌కుమార్, వెంకటగిరికి చెందిన లోకేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.





మున్సిపాలిటీ వీధి, బ్రాహ్మణవీధిలో అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు

అడుగడుగునా... స్పీడ్ బ్రేకర్లు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు ● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

నాయుడుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి వీధిలో అక్రమంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. విద్యాలయాలు, ప్రార్థనామందిరాలు, ప్రమాదకర ప్రాంతాల్లో మాత్రమే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఎత్తు 6 ఇంచులు, వెడల్పు 11 ఇంచులతో ఏటవాలుగా ఇరువైపులా వాహనాల రాకపోకలకు అనువుగా స్పీడ్ బ్రేకర్లు ఉండాలి. ఇందుకు భిన్నంగా పట్టణంలోని ప్రతి వీధిలో పరిమితికి మించిన ఎత్తుతో స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా ఇళ్ల ముందు కాంక్రీట్‌తో ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లుగా అమర్చుతున్నారు. ప్రధాన మార్గాలతో పాటు చిన్నచిన్న వీధుల్లోనూ ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్పీడ్ బ్రేకర్ల ఎత్తు ఎక్కువగా ఉండడంతో అడుగుభాగం తగిలి వాహనాలు దెబ్బతింటున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధిని చూడలేక వైసీపీ విషం చిమ్ముతోంది: విజయశ్రీ



రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయశ్రీ, ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

ఓజిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని విస్మరించిన వైసీపీ నేడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం భట్లకనుపూరు, చిల్లమానుచేను, భువనగిరిపాళెం మీదుగా చిల్లకూరు మండలం అయ్యవారిపాళెం వరకు రూ.8.38 కోట్లతో నిర్మించిన రోడ్డును బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిని దేవతల రాజధానిగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలను తట్టుకోలేని వైసీపీ మహిళలను కించపరిచేలా మాట్లాడడం దుర్మార్గమన్నారు. గతి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఏడాది కాలంలోనే అభివృద్ధి బాటలోకి తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషిని కొనియాడారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నామన్నారు. ప్రధానంగా రోడ్లను బాగు చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో ఈ ఏడాది కాలంలో రూ.27 కోట్ల వ్యయంతో రోడ్ల ఏర్పాటు, మరమ్మతులు చేపట్టామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధికి అంబాసిడర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, పంచాయతీరాజ్ ఈఈ రమణ, డీఈ సురేష్, ఆర్అండ్‌బీ డీఈ పరమేశ్వరి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఏఈలు సురేష్ చౌదరి, వీరాస్వామి, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, గున్నం సేవాట్రస్ట్ అధినేత గున్నం మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు బచ్చుల రవీంద్రారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్, ఈశ్వరరాజు, సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కురుగొండ్ల



పొలాల్లో దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని పంజామ్ గ్రామంలోని భూముల్లో పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు అధునాతన వ్యవసాయ పనిముట్లను రైతులకు రాయితీతో అందించడం జరుగుతోందన్నారు. డక్కిలి మండలానికి మూడు, వెంకటగిరి, బాలాయపల్లి మండలాలకు ఒక్కొకటి చొప్పున ఐదు డ్రోన్‌లను 80 శాతం రాయితీతో రైతు సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ షన్ముగం, ఏడీ నాగార్జున, మూడు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని మహిళ ఆత్మహత్య

చిట్టమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలకలపూడి గ్రామానికి చెందిన రాజేశ్వరి (42) విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు... మొలకలపూడి గ్రామానికి చెందిన రాజేశ్వరి, ఆమె భర్త మణి మధ్య మంగళవారం రాత్రి గొడవ జరిగింది. మనస్థాపంతో రాజేశ్వరి విష గిళికలు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. నాయుడుపేట ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. రాజేశ్వరి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

అక్రమంగా చెట్ల నరివేత

గూడూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాళెం గ్రామ సమీపంలోని మర్రిపల్లెమడుగు కలుజుకట్ట ప్రాంతంలో కొందరు చెట్లను అక్రమంగా నరికివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బుధవారం కలుజుకు సమీపంలోని కట్టపై ఉన్న చెట్లను నరికివేసి కలపను తరలించారని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి చెందిన విలువైన కలపను అక్రమంగా తరలించడాన్ని అధికారులు అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

సిమెంటు రోడ్ల ప్రారంభం

వెంకటగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెట్లూరు, మొగళ్ళగుంట, పంజామ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, జీకేపల్లి బాబునాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

తడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో భాగంగా గురువారం అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని ఎంఈవో మల్లికార్జున్ తెలిపారు. బుధవారం పాఠ్యపుస్తకాలతో కూడిన విద్యా సామగ్రిని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం వినియోగిస్తారని చెప్పారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కోట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌కుమార్, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

5,520 మందికి స్టూడెంట్ కిట్లు

కోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకులాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 5,520 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్‌లను ఎంఈవో మస్తానయ్య బుధవారం పాఠశాలలకు పంపారు.

14న మండలస్థాయి యోగాంధ్ర

తడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్ నాయక్ తెలిపారు. అలాగే ఈనెల 19వ తేదీ భీములవారి పాళెం పడవలరేవు వద్ద ఉన్న రిసార్ట్‌లో జిల్లాస్థాయి యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన రాజేంద్ర స్థానికంగా ఓ దాబాలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఫుడ్ డెలివరీ ఇచ్చేందుకు మోటర్ సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయ పడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్మాగారంలో మెషిన్ వద్ద పనిచేస్తుండగా చేతికి గాయాలయ్యాయి. వెంటనే నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెన్నై తీసుకెళ్లారు.

బలిజలను బీసీ జాబితాలో చేర్చాలి

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాలకు రిజర్వేషన్ లేకపోవడం వల్ల వెనుకబడిపోయారన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గూడూరు అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసును అందజేశారు. పారిశుధ్య కార్మికులకు డీఆర్‌సీ జీతాలు, కరువు భత్యం ఇవ్వాలని కోరారు. అలాగే గత సమ్మె కాలంలో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

దేశాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

కేంద్రమంత్రి బండి సంజయ్



కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి సంజయ్

తిరుపతి(విద్య), జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని, అందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతిలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బండి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. గతేడాది దేశం మొత్తంలో 25 కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటు చేయగా వాటిలో 8 ఏపీలోనే ఏర్పాటు చేసిందన్నారు. తిరుపతిలో ఐఐటీ, ఐషర్‌కు సొంత భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అమరావతి- కాకినాడ-తిరుపతి- విశాఖ నగరాలను స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపిక చేశారని, చెన్నై-బెంగళూరు, విశాఖ-చెన్నై, హైదరాబాద్- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లుగా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌ను అంత ర్జాతీయ స్థాయి విమానాశ్రయంగా ప్రకటిం చారని, కడప విమానాశ్రయానికి కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణానికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారని వివ రించారు. చిత్తూరు-తచ్చూర్, బెంగళూరు - కడప - విజయవాడ కారిడార్లు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ అభివృద్ధికి రూ.3,984 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి ఇంతటితో ఆగిపోకూడదంటే రాబోయే కాలంలోనూ ఎన్డీఏను ఆదరించాలని, మోదీని గెలిపించాలని కోరారు. అనం తరం ఆయన కంచి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుని, పోలీసు గౌరవ వందనం స్వీకరించి పోలీస్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అంతకుముందు మోదీ పాలనపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, తిలకించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డ్ సభ్యుడు, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కోలా ఆనంద్, నవీన్‌కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ అరెస్టు

- రూ.1.48 లక్షలు, ల్యాప్‌టాప్ స్వాధీనం
- కారు షోరూములు, షాపింగ్ మాల్స్ లక్ష్యంగా దొంగతనాలు
- ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లో పదేళ్లుగా కార్ల షోరూంలు, షాపింగ్ మాల్స్‌ను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ మంగళ్ సింగ్ చౌహాన్‌ను తిరుపతి క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ 1.48 లక్షలు నగదు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం న్యూహార్ సూద్ తాలూకా, జునాపని గ్రామానికి చెందిన మంగళ్ సింగ్ చౌహాన్, అతడి బంధువులు రాహుల్, కిషన్, అక్షయ్ ఈనెల 3, 4 తేదీల్లో తిరుపతి పట్టణ, రూరల్ పరిధిలోని మారుతీ కార్ల షోరూముల్లో దోపిడీకి పాల్పడి, రూ.5 లక్షలు అపహరించారు. వీరిని పట్టుకోవడానికి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు శ్యాం సుందర్, భక్తవత్సలం, క్రైం సీఐలతో ప్రత్యేక బృందాలను నియమించారు. దోపిడీ జరిగిన ప్రదేశంలోని ఫింగర్ ప్రింట్లను సేకరించి.. పోలీసుల వద్ద ఉన్న పాత నేరస్థుల వేలి ముద్రలు, కనుబొమ్మలతో పరిశీలించారు. దీంతో జునాపని గ్రామానికి చెందిన దోపిడీదారుడు రాహుల్ వేలిముద్ర సరిపోయింది. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి.. న్యూహార్‌సూద్ పోలీసులతో కలిసి వారం రోజుల పాటు నిఘా ఉంచారు. ప్రధాన నిందితుడు మంగళ్ సింగ్ చౌహాన్ వాడుతున్న ఫోన్ నెంబరు, అతడి సంభాషణ రికార్డులు ట్రాప్ చేశారు. బుధవారం తిరుపతికి సమీపంలోని ఉప్పరపల్లి క్రాస్ వద్ద క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి మంగళ్ సింగ్ చౌహాన్‌ను అరెస్టు చేశారు. చోరీకి గురైన రూ.5 లక్షల్లో దాదాపు రూ.1.48 లక్షలను అతడి నుంచి పోలీసులు రికవరీ చేశారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన సీసీఎస్ సీఐలు చిన్న పెద్దయ్య, ప్రకాష్‌కుమార్, శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ రెడ్డి, ఏఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుళ్ళు రవిప్రకాష్, మునిరాజా, కానిస్టేబుళ్ళు నాగరాజు, మోహన్, మునిరత్నం, పురంధర, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

ఆగి..సాగిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

స్పౌజ్ అంశంలో సమస్యలు ● ఉపాధ్యాయ సంఘ నేతలతో డీఆర్వో చర్చలు



డీఆర్వో మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ అభ్యంతరాల నడుమ సాగుతోంది. రావాల్సిన పాయింట్లు రాకపోవడంతో అర్హత ఉన్నా, అనుకూల ప్రాంతాలు రాలేదంటూ టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కౌన్సెలింగ్ ప్రక్రియలో పలు అభ్యంతరాలు లేవనెత్తారు. చిత్తూరు షర్మన్ మెమోరియల్ బాలికల పాఠశాలలో మంగళవారం రాత్రి 10.50 గంటలకు డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన మొదలైన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ బుధవారం తెల్లవారుజాము 3 గంటల వరకు సాగింది. 203మంది ఎస్జీటీలకు బదిలీలు పూర్తి చేశారు. 204వ టీచర్ బదిలీ వచ్చే సరికి స్పౌజ్ సమస్య తలెత్తడంతో దాన్ని నివారించడానికి ఉదయం 6.45 గంటలైంది. ఆపై కొనసాగుతూ ఉదయం 10.50గంటల వరకు 212 వరకు చేరుకుంది. తర్వాత కూడా స్పౌజ్ అంశంలో సమస్యలు తలెత్తడం విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మా రింది. మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉపాధ్యాయ సంఘాల నేతలకు విద్యాశాఖాధికారుల మధ్య సుదీర్ఘ వాదనలు సాగాయి. సమస్య తీవ్రతరం కావడంతో డీఈవో వరలక్ష్మి పరిస్థితులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు దృష్టికి తీసుకుపోయారు. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్వో మోహన్ కుమార్ రంగంలోకి దిగారు. దాదాపు 45 నిమిషాల పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు లేవనెత్తిన పలు సమస్యలపై డీఈవోతో పాటు ఫోన్లో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌తోనూ సమీక్షించారు. ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన అంశాలు సరైనవి కావని స్పష్టం చేశాక కౌన్సెలింగ్ సజావుగా జరిగేలా చూడాలని కోరారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు ఉపాధ్యాయులు తమకు బదిలీ వద్దంటూ వెళ్లిపోయారు. డీఆర్వో దగ్గరుండి బదిలీ ప్రక్రియను కొనసాగించడంతో రాత్రి 7.15 గంటల వరకు 350మంది టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ పూర్తయింది. ఆపై 351 నుంచి 500 వరకు బదిలీ కౌన్సెలింగ్ కొనసాగించారు. కాగా గురువారం ఉదయం 11 గంటలకు 501 నుంచి వెయ్యి మంది వరకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి ప్రకటించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



వైద్య పరీక్షలకు హాజరైన వైద్యులు తదితరులు

శ్రీకాళహస్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోటరీ క్లబ్, స్విమ్స్ ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. దాదాపు వందమంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజు, మెడికల్ ఆఫీసర్ హరిత, పీఆర్వో చంద్రమోహన్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి సిద్ధులు గారి ప్రసాద్, సభ్యులు కండ్రిగ ఉమ, పి.జనార్దన్, వెంటకముని, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే

తోతాపురి మామిడికాయల కొనుగోలు



కాయలను అన్‌లోడ్ చేయిస్తున్న తహసీల్దార్ తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలను ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.12వేలకు కొనుగోలు చేయాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని గాజులపెళ్లూరులోని రసా ఫుడ్స్ ఫ్యాక్టరీని ఆమె బుధవారం పరిశీలించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో తోతాపురి రకం మామిడి కాయల కొనుగోలుపై చర్చించారు. రైల్వేకోడూరు నుంచి వచ్చిన 9 లారీల లోడ్ల తోతాపురి కాయలను ఫ్యాక్టరీలో దగ్గరుండి అన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రకటించిన టన్ను రూ.12వేలలో ప్రభుత్వం రూ.4 వేలు చెల్లిస్తుందని తెలిపారు. ఆర్ఐ నల్లయ్య, వీర్వోలు వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల మీట్

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన మండల మీట్‌కు వివిధ శాఖల అధికారులు గైర్హాజరవడంతో ప్రధాన సమస్యలు చర్చకు రాలేదు. దీంతో సమావేశానికి హాజరైన సభ్యులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమావేశానికి రెవెన్యూ, ఎక్సైజ్, ఆర్అండ్‌బీ, పీఆర్, ట్రాన్స్‌కో, అటవీ, వెటర్నరీ, మత్స్య శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ప్రతిమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మూడు నెలకొకసారి నిర్వహించే మండల మీట్‌లో సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన మండల మీట్‌కు అధికారులు హాజరు కాకాపోవడం ఏమిటని ప్రశ్నించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలకోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. డిప్యూటి ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, ఏవో త్రివిక్రమరావు, వెలుగు ఏపీఎం డాంగేయాదవ్, ఏఈ ఇబ్రహీంఖాన్, ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో 2 ఉష, ఏవోలు మురళి, రాధారాణి, సీడీపీవో దేవకుమారి, ఎంపీపీ సరోజిని, కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, ఎంపీటీసీ సభ్యులు సెల్వి, బాలయ్య, మోహన్, సర్పంచులు రవిరెడ్డి, మధురాజు, గోవిందస్వామి, రూబెన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తా

నారాయణవనం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేసున్నానని, గ్రామాభివృద్ధి, మౌలిక వసతులను కల్పిస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం నారాయణవనం పట్టణంలోని కైనికట్టు వీధిలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ నిధులతో రూ.16 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభించారు. అలాగే చెత్త సేకరణ బుట్టలను, ట్రైసైకిల్‌ను ప్రారంభించారు. సర్పంచ్ కేజీ శారదమ్మ గణేషన్, జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, మాజీ ఎంపిపి గోవిందస్వామి, డీఎల్‌పీవో పద్మజ, ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, డాక్టర్ వేణయ్య, పంచాయతీ ఈవో షణ్ముగం, ఏపీవో సుకన్య, ఏపీఎం మమత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో కల్తీలేని ఆహారం

కేవీబీపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో కల్తీలేని ఆహారాన్ని దిగుబడి చేయడమే కాకుండా సాగు ఖర్చును ఆదా చేసుకోవచ్చని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ తెలిపారు. బుధవారం మండలంలోని ఆదవరంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను తింటే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కుమారి, సుబ్బయ్య, గిరి, ప్రభాకర్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవల మహర్షి జయంతి

వరదయ్యపాళెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దేవాంగ మూలపురుషుడు దేవల మహర్షి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాంగ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ తిలక్‌బాబు ఇంట్లో దేవల మహర్షికి వివిధ రకాల పూజలు నిర్వహించారు. త్యాగరాజు, రమేష్, మోహన్, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

- పురవీధుల్లో విహరించిన అమ్మవారు







వివిధ వేషధారణలో భక్తులు - గంగమ్మకు సారె తీసుకువస్తున్న పల్లికొండేశ్వరాలయ అధికారులు - పట్టణంలో విహరిస్తున్న గంగమ్మ

సత్యవేడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంగమ్మ జాతర వేడుక వైభవంగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం గంగమ్మకు పుట్టినిల్లుగా బావించే కుమ్మరి వారి ఇంట్లో బంకమన్నుతో అమ్మవారి ప్రతిమ రూపుదిద్దుకుంది. అక్కడ నుంచి మెట్టినిలైన పెద్ద చాకలి ఇంటికి చేరుకున్న అమ్మవారిని పుష్పాలు, బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగ అలంకరించారు. అనంతరం రాత్రి పదిగంటల సమయంలో గ్రామ పెద్దల అనుమతితో మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలా టాలు, బాణసంచా పేలుళ్ల మధ్య అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులతో పట్టణం జనసంద్రంగా మారింది. నేతాజీ రోడ్డులో మొదలైన అమ్మవారి ఊరేగింపు పట్టణంలో నిర్దేశించిన వీధుల్లో వేకువజాము వరకు కొనసాగింది. అనంతరం స్థానిక గంగమిట్ట వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరిలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారు ఊరేగింపు సందర్భంగా అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. జాతర నేపథ్యంలో పట్టణంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన చుట్టాలు, బంధువులతో సందడి వాతావరణం నెలకొంది.

అమ్మవారికి పల్లికొండేశ్వరుడి సారె

నాగలాపురం మండలం సురుటుపల్లెలోని పల్లికొండేశ్వరస్వామి దేవస్థానం తరపున ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గంగమ్మకు సారెను సమర్పించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అమ్మవారి సారెను ఉంచి పూజలు చేసిన అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి గంగమిట్టకు చేరుకుని జాతర నిర్వాహకులకు సారెను అందించారు. గంగమిట్ట వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు పలికి ఎమ్మెల్యేకు తీర్థ, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లత, ఎస్ఐ రామస్వామి, నాయకులు పరమశివం, చిన్న, బాలమురళి, వెంకటరమణ, శివానందం, రాజా, డీపీఎస్, ఇళంగోవన్‌రెడ్డి, మురళి, ఎస్ఎం సురేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఛానల్‌ను నిషేధించాలి: ఎమ్మెల్యే సుధీర్



కాసరం రోడ్డు శిలాఫలకం ఆవిష్కరణ

రేణిగుంట, జూన్ 11, (ఆంధ్రజ్యోతి): సాక్షి ఛానల్, పత్రికను నిషేధించాలని ఎమ్మెల్యే సుధీర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గాజులమండ్యం పంచాయతీ దేశమ్మ కాలనీలో రూ.1.17 కోట్లతో దేశమ్మ కాలనీ నుంచి పూడి, ఏఆర్ రోడ్డు, విప్పమాన పట్టెడ వరకు తారురోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వ సంవత్సర పాలనను జీర్ణించుకోలేకనే రాష్ట్ర ప్రజలను సాక్షి ఛానల్, పత్రిక, సోషల్ మీడియా ద్వారా పక్కదారి పట్టిస్తోందన్నారు. రేణిగుంట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన వసుంధర నగర్, భగత్‌సింగ్ కాలనీల్లో త్వరలో కాలువలను నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలోని అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు మూడు సెంట్ల లెక్కన ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రా రెడ్డి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు తేజోవతి, చిన్నారెడ్డి, తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయకులు నీలకంఠారెడ్డి, హరి, పట్టాబి, ఓబుల్‌రెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీరెడ్డి అన్నారు. బుధవారం శ్రీకాళహస్తి నుంచి కాసరం వరకు రూ.1.50కోట్లతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. గత ప్రభుత్వంలో మరమ్మతులకు గురైన రోడ్లకు కనీసం తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, రావిళ్ల మునిరాజానాయుడు, గాలి మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూ రికార్డుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జేసీ

కేవీబీపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిషేధిత భూముల వివరాలను బుధవారం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2020 నుంచి ఇప్పటి వరకు నిషేధిత భూముల ఆమోదం, తిరస్కరణపై పాత రికార్డులను ఆయన పరిశీలించారు. త్వరలోనే నిషేధిత భూముల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు మధుసూదన్, తిరుపతి కలెక్టరేట్ డీటీ శిరీష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై శిక్షణ



ఎస్‌వోఎస్‌లో అవగాహన కల్పిస్తున్న సుధాకర్‌రెడ్డి

ఏర్పేడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపల్లి వద్ద ఉన్న ఎస్‌వోఎస్ స్వచ్ఛంద సంస్థలో బుధవారం విలువలతో కూడిన జీవన నైపుణ్యాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చారు. జీవితం కోసం అవసరమైన ముఖ్యమైన నైపుణ్యాలపై పిల్లలకు ప్రముఖ మానసిక నిపుణుడు డాక్టర్ ఎన్.బీ. సుధార్‌రెడ్డి అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసం, కుటుంబం, సమాజంలో సమర్థంగా ముందుకు సాగేందుకు అవసరమైన సామర్థ్యాలను బోధించాడు. ఈ శిక్షణలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడం, పరిష్కారం చూపడంపై అవగాహన కల్పించారు. విమర్శనాత్మక ఆలోచన, సంబంధాల నిర్వహణ తదితర అంశాలు మానవీయ విలువలతో వ్యక్తిత్వాన్ని నిర్మించేందుకు తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమం లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, మునిరత్నం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

14నుంచి

బస్సు పాసుల మంజూరు

శ్రీకాళహస్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ పరిధిలో ఈ నెల 14వ తేదీ శనివారం నుంచి బస్సు పాసులు మంజూరు చేయనున్నట్టు డిపో మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. బస్సు పాసు కోసం 10వ తరగతికంటే ఆపై చదివిన వారు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, ఫోటో, స్టడీ సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. 10వ తరగతికంటే తక్కువ చదివిన వారు ఆధార్‌కార్డు, ఫొటో, స్టడీ సర్టిఫికెట్ తమ వెంట తీసుకుని రావాలన్నారు.

సిమెంటు రోడ్డు ప్రారంభం

పిచ్చాటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పల్లెసీమల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరు పట్టణంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డును బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గ్రామాల్లో సిమెంటు రోడ్లు, శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పన, పశువుల షెడ్లు తదితర అభివృద్ధి పనులతో దూసుకు పోతోందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బదిలీ

రేణిగుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఎంపీడీవో విష్ణు చిరంజీవి నాయుడు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా మాచర్లకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీగా ప్రభురావును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు.

విద్యతోనే అభివృద్ధి

వరదయ్యపాళెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బజావతి, శిల్ప తెలిపారు. అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంతవేలూరు అంగన్‌వాడీ కేంద్రం 1, 2, ఎస్టీకాలనీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు చిన్నారులను తల్లిదండ్రులు చేర్పించారు. చిన్నారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఎంపీటీసీ సభ్యులు మణి, ఎంఎల్‌హెచ్‌పీ శారద, ఏఎన్ఎం సెల్వకుమారి తదితరులు పాల్గొన్నారు.

మోహినీ అలంకారంలో ప్రసన్న వెంకన్న అభయం







పల్లకీ ఉత్సవం - లక్ష్మీ హారం ఊరేగింపు - గరుడ వాహన సేవ

వడమాలపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారు మోహినీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కొలాటాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. వాహనసేవ అనంతరం అలసిన పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరింపజేసి భక్తుల గోవింద నామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు.

కోలాహలంగా శ్రీవారి గరుడసేవ

వార్షిక బ్రహోత్సవాల్లో బుధవారం రాత్రి భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి గరుడసేవ కోలాహలంగా నిర్వహించారు. శ్రీవారికి అత్యంత ప్రీతీపాత్రమైన గరుడుడి ని వాహనంగా చేసుకొన్న ప్రసన్న వేంకటేశ్వరుడు పట్టు పీతాంబరాలు, సర్వాలంకార భూషితుడై, లక్ష్మీకాసుల హారాన్ని ధరించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మంగళవాయిద్యాలు, భజనలు, అర్చకుల వేదమంత్రాలు, కేరళ డప్పు వాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ గరుడ వాహన సేవను తిలకించి భక్తులు పునీతులయ్యారు. అడుగడుగునా భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. వడమాలపేట, పుత్తూరు, తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఎఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణభట్టార్ తిప్పయ్యాఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా లక్ష్మీకాసుల హారం

గరుడోత్సవం సందర్భంగా శ్రీవారికి తిరుమల నుంచి లక్ష్మీకాసుల హారాన్ని మంగళవాద్యాలతో ఊరేగింపుగా అప్పలాయగుంటకు తీసుకువచ్చారు. శ్రీవారి లక్ష్మీకాసుల హారానికి ప్రత్యేకంగా పూజలు చేసి అలంకార మండపానికి పటిష్ఠ భద్రత మధ్య తరలించారు.

ప్రసన్న వేంకటేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



వడమాలపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. బ్రహ్మోత్స వాలకు ఎమ్మెల్యేను టీటీడీ అధికా రులు ఆహ్వానించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగిరి నియోజకవర్గానికి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న అప్పలాయగుంట ముఖద్వారమని, ఆయన ఆశీస్సులతోనే విజయం సాధించానని చెప్పారు.

కారు ఢీ కొని ఒకరి మృతి



జ్ఞానేంద్ర (ఫైల్ ఫొటో)

వడమాలపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో కారు ఢీ కొని వడమాలకు చెందిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పుత్తూరు నుంచి తిరుపతికి వెళ్తున్న కారు వడమాలపేట నుంచి టోల్‌గేట్ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకోంది. బైక్ నడుపుతున్న జ్ఞానేంద్రకుమార్(21) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు.

కేంద్రమంత్రికి ఘనస్వాగతం



శ్రీకాళహస్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు తిరుపతి విమానాశ్రయంలో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సహా బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తిరుపతిలో జరిగిన 11 సంవత్సరాల మోదీ పాలన, సేవ సంబంధించి ప్రదర్శన, మీడియా సమావేశం తదితర సమావేశాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ



శ్రీకాళహస్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు షర్మిల పర్యటన

శ్రీకాళహస్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కళిందర్, శబరి రాజన్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.